క్లుప్తంగా

నేడు మండల సమావేశం

నందలూరు : ఎంపీపీ కార్యాలయంలోని సభా భవనంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

రాజంపేట : రాజంపేట కోర్టు క్యాంపస్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన తన చాంబరులో విలేకర్లతో మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజాఉదయప్రకాశ్‌లు పాల్గొన్నారు.

ఏపూరమ్మకు పూజలు



బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ బహుదానది ఒడ్డున వెలసిన ఏపూరమ్మకు ఆ గ్రామ ప్రజలు గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎంపీడీఓ సమీక్ష

సంబేపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెగసీ వేస్ట్, లింక్‌రోడ్స్, హ్యాండ్ పంప్స్, 15 ఫైనాన్స్ నిధులు తదితర అంశాలపై చర్చించారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైన సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా ప్రభాకర్

పెనగలూరు : మండల సర్వేయర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సర్వేయర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం బదిలీకావడంతో నందలూరు మండలంలో పనిచేస్తున్న ప్రభాకర్ పెనగలూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలకు సంబంధించి సర్వే పనులు ఏమైనా ఉంటే రైతులకు అందుబాటులో ఉంటామన్నారు.

దంపతులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట : వైఎస్సార్ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి కుమారుడుకి నూతనంగా వివాహం కావడంతో గురువారం వారి స్వగృహంలో నూతన వధూవరులైన ఇరగంరెడ్డి శ్రీఖర్ రెడ్డి, డాక్టర్ అమృత వర్షిణీలను మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.రాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర

చిట్వేలి : నాగవరం పంచాయతీ తిరుమలశెట్టిపల్లిలో గురువారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జాతర ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామున పోతురాజు ముందు వెళ్తుండగా గంగమ్మ గుడికి బయలుదేరింది. ఈ మధ్యలో భక్తులు బలిదానాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పందేరపు బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండల నలుమూలల నుంచి బంధువులు, స్నేహితులు జాతరకు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. పలువురు రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



చిట్వేలిలో పీర్ల గ్రామోత్సవం

చిట్వేలి : త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలను మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పదిరోజులపాటు జరిగే వేడుకలలో భాగంగా పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పీర్లచావిడి వద్ద అగ్ని గుండాలు వేశారు. గురువారం సింగనమల వీధి, తోపువీధిలలో పీర్ల చావిడిల నుంచి మేళతాళాల మధ్య పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రసాదం చదివింపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వం కాదిది.. వంచక ప్రభుత్వం

- గిట్టుబాటు ధరలు లేక నష్టాల్లో రైతులు
- ఖరీఫ్ సాగు పనులకు అనకూల పరిస్థితి
- తమ ఆవేదనను వైఎస్సార్‌సీపీ నేతలతో పంచుకున్న రైతులు



మాధవరంలో రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాయచోటి : రాష్ట్రంలో ఏడాది పాలనలో ఏదో సాధించినట్లు ఇంటింటికి సంక్షేమం అంటూ కూటమి పాలన చేస్తున్న హడావిడిని చూస్తే సంక్షేమ పాలన కంటే వంచక పాలనగా కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని మాధవరం పంచాయతీలోని పల్లె ప్రజలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం, పోలు సుబ్బారెడ్డిలతో కలిసి రైతులతో మమేకమయ్యారు. గ్రామంలోని ఏ పల్లెకు వెళ్లినా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, వారి ఆర్థిక వేదనలు నేతలకు ఆవేదనలుగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం మాత్రం ఏడాదిలో తామేదో సాధించినట్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచడం దారుణమన్నారు. చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి లేక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం ప్రజల వద్దకు ఏముఖం పెట్టుకొని వెళుతోందంటూ వారు ప్రశ్నించారు. మామిడికి ధరలు లేక తోటల్లోనే వదిలేశామంటూ నేతల ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదును దాటిపోతున్నా వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటగా సాగు చేసే వేరుశనగ, ఇతర వర్షాధార పంటలు సాగు చేయలేక రైతులు దిక్కులు చూస్తున్నారన్నారు. వ్యవసాయ కూలీ పనులు లేక కూలీలు గ్రామాలు వదిలి వలస బాట పట్టారన్నారు. పాలరేట్లు తగ్గడంతో పాడిపై జీవనం సాగిస్తున్న రైతులు మరింత ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా పెట్టుబడి నిధులు అందక ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కళ్ల ఎదుట కనిపిస్తున్నాయన్నారు. మామిడికి గిట్టుబాటు ధరలు కలి్పంచి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేలు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా డబ్బులు అందేవన్నారు. పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందేవని, ఈ కూటమి ప్రభుత్వంలో సంవత్సరం దాటిపోయినా రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. పంటలు నష్టపోయినా ఎటువంటి పరిహారం రాక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు, ప్రజలకు ఎల్లవేళలా తోడుంటామని శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, బాల సుబ్రమణ్యంలు భరోసా ఇచ్చారు.

హాకీకా కార్యక్రమంలో..

మాధవరం గ్రామంలోని షేక్ దర్బార్ బాష పిల్లల హాకీకా వేడుకలో శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుబ్రమణ్యం, పోలు సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. వీరి వెంట స్థానిక నాయకులు దివాన్, ఎంపీటీసీలు రామ్మోహన్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, ఉప సర్పంచ్ జయ, కౌన్సిలర్ కసిరెడ్డి, నరసింహరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్, సుధ, ఇర్షాద్, భుట్టో, రామ్మోహన్ రెడ్డి, భాస్కర్, షేక్ గౌస్, రఘురామిరెడ్డి, పీర్, గౌస్ అలీ, అల్లాబకాష్, ఖలీల్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మున్సిపాలిటీలోని పాఠశాలలకు బదిలీలు, పదోన్నతులు కల్పించారు. జ

అయితే మున్సిపాలిటీ పరిధిలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు-1, హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు 3, హిందీ -1, వివేకానంద మున్సిపల్ (ఆర్ ఆర్ లేవుట్) ఉన్నత పాఠశాలలలో తెలుగు -4, హిందీ-3, వివేకానంద మున్సిపల్ (మాయబజార్) ఉన్నత పాఠశాలలో తెలుగు 2, హిందీ -1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలు తెరచి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు పోస్టులు భర్తీకి నోచుకోలేదు. పోస్టులు భర్తీ చేయాలని యూటీఎఫ్ నాయకులు డీవైఈఓకు వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలి

రాయచోటి : విద్యార్థులలో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయడం ప్రాథమిక విద్యలో ప్రధానమని డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణం కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై అధ్యాయనాన్ని డైట్ తరపున ఆయన చేపట్టారు. గత సంవత్సరం 3వ తరగతి పూర్తి చేసుకొని ప్రస్తుతం నాల్గో తరగతిలో ఉన్న 32 మంది విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుగు, ఆంగ్లం, గణితంలలో ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి నమోదు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో నూతనత్వం ఉండాలన్నారు. సాంకేతికతను జోడించి బోధన చేయడం ద్వారా విద్యార్థుల పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుంటారన్నారు. దీనివలన విద్యార్థులకు విజ్ఞానంతోపాటు అనుభవాత్మక విద్యార్జన లభిస్తుందన్నారు. ఇందుకోసం తరగతి వారీగా చార్టులు, కథల పుస్తకాలు, డ్రాయింగ్, పెయింటింగ్ సామగ్రి, వర్క్ షీట్లు, వర్క్ బుక్‌లు, పోస్టర్లు, క్రాఫ్ట్ వస్తువుల వంటి అభ్యసన సామగ్రిని ప్రతి విద్యార్థికి సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరమ్మ, ఉపాధ్యాయులు చెంచురెడ్డి, గౌత్రీ నాయక్, విమల కుమారి, రాధమ్మ, సరితమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునుపెన్నడూ లేని విధంగా నష్టాల్లో రైతాంగం



వైఎస్సార్‌సీపీ నాయకులు చాన్‌బాషాను పరామర్శిస్తున్న శ్రీకాంత్ రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి : రెండేళ్ల పాటు వర్షాలు లేక అవస్థలు పడ్డ రైతులకు మరో పది రోజులలోపు వర్షాలు సమృద్ధిగా కురవకపోతే ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నట్లు పలువురు రైతులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి తమ ఆవేదనను తెలియజేశారు. గురువారం మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డిలతోపాటు పలువురు మండలంలోని రైతులు, నాయకులు, కార్యకర్తలు శ్రీకాంత్ రెడ్డిని కలిసి సాగు సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేసుకోవడానికి పదునుపాటి వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగు కోసం పెట్టుబడులు పెట్టేందుకు రైతులు వెనుకాడుతున్నారన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో తిండి గింజలు కూడా లేని దుర్భిక్ష పరిస్థితులు దాపురించే అవకాశాలు లేకపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు అలీ షేర్, సాహెబ్, జాకీర్, బాబ్జాన్, ఖదీర్, వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్ కుమార్, నాగేంద్రబాబు, నాగేశ్వారెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్‌కు పరామర్శ

ప్రమాదవశాత్తు గాయపడిన విశ్రాంతి తీసుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మైనార్టీ నాయకులు చాన్ బాషాను గురువారం ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

30 ఏళ్ల స్థల సమస్య పరిష్కారం

వీరబల్లి : మండల కేంద్రంలో సర్వే నెంబరు. 547/2లో ఇద్దరు అన్నదమ్ములైన కరీముల్లా, మహబూబ్ బేగ్ మధ్య గత 30 సంవత్సరాలుగా స్థల వివాదం కొనసాగుతూ ఉండేది. ఈ ఇంటిస్థలం సమస్య చిలికి చిలికి గాలివానగా మారి చివరకు జిల్లా అధికారుల దృష్టికి సైతం వెళ్లింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ వారు, రూరల్ సీఐ వరప్రసాద్, స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి జోక్యం చేసుకొని ఇంటిస్థలం హక్కు పత్రాలు పరిశీలించి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. బేగ్ సోదరుడైన కరీముల్లా భార్య అమిరున్ బేగం పేరుతో హక్కుపత్రాలు ఉండటంతో వాటిని పరిశీలించి ఈ ఇంటిస్థలం ఆమెకే చెందుతుందని తెలిపారు. ఈ సమస్యను గత 30 సంవత్సరాలుగా గతంలో పనిచేసిన తహసీల్దార్లు, ఎస్ఐలు, రూరల్ సీఐలు ఎవరూ పరిష్కరించలేకపోవడంతో ఆ స్థలం వివాదాస్పదంగానే మిగిలిపోయింది. చివరకు గత పదిరోజుల ముందు సీఐ వరప్రసాద్ జోక్యం చేసుకొని అమిరున్ బేగంను ఇంటి నిర్మాణ పనులు చేపట్టవచ్చని తెలియజేశారు. ప్రస్తుతం సదరు స్థలంలో పనులు కూడా కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కరించిన అధికారులకు, సీఐ, పోలీసు సిబ్బందికి కరీముల్లా కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

డెంగ్యూ నివారణకు సహకరించాలి

సిద్దవటం : ప్రతి ఏడాది జూలై మాసాన్ని డెంగ్యూ మాసోత్సవంగా జరుపుకుంటున్నామని సిద్దవటం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డెంగ్యూ జ్వరాలపై విద్యార్థులకు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇటీవల అన్ని గ్రామాల్లో డెంగ్యూ జ్వరాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో గాని, ఇంటి చుట్టపక్కల గాని నిలువ ఉన్న నీటిని గుర్తించి వాటిని తరలిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం గాడి శ్రీహరి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూపులపై నిఘా



మహమ్మద్‌రఫీ, ఎస్ఐ

సిద్దవటం : అభ్యంతరకర పోస్టులు, కామెంట్లతో ఇతరులను ఇబ్బంది పెడుతున్న వాట్సాప్ గ్రూప్‌లు, గ్రూప్ సభ్యులపై ప్రత్యేక నిఘా సారిస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ కొన్ని వాట్సాప్ గ్రూపులలో కామెంట్లు, అసభ్య పదజాలాలతో కూడిన మెసేజీలు పెడుతున్నారన్నారు. అట్టివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది విలేకరులమని చెప్పుకుంటూ టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలపై ప్రెస్ అని స్టిక్కర్‌లు ఉన్న వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో గుర్తింపు పొందిన సంస్థల్లో పనిచేసే విలేకరులే ప్రెస్ అని స్టిక్కరింగ్ వేసుకునే ప్రాధాన్యత ఉందన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునఃనిర్మించాలి



ప్రాజెక్టు వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట టౌన్ : వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వెంటనే పునఃనిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పూల భాస్కర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం గతంలో దెబ్బతిన్న అన్నమయ్య ప్రాజెక్టును సందర్శించారు. అలానే అప్పటి వరద బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు అన్నమయ్య ప్రాజెక్టును నిర్మించలేదని విమర్శించారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నమయ్య ప్రాజెక్టు గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నమయ్య ప్రాజెక్టును నిర్మించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు వరద సమయంలో మృతి చెందిన వారి కుటుంబాల్లోని ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పునఃనిర్మాణం, వరద బాధితుల సమస్యలను రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు చెప్పారు. ఇదిలావుంటే తొలుత ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం అలసత్వం విడనాడాలని ప్రాజెక్టు వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

రాజంపేట టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి చంద్ర. జిల్లా కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఈనెల 9వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఆర్థిక, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ సంపదను అదానీ, అంబానీలకు అప్పనంగా కట్టబెట్టే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక నాయకులు నరసింహ, సుబ్రమణ్యం, జయరామయ్య, భీమయ్య, మల్లికార్జున, శ్రీరాములు, బాషా, గోవిందు, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

ఓబులవారిపల్లె : ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించి భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని రక్షించాలని కరస్పాండెంట్ టి.యువరాజ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో యువతకు పెద్దపీట

గాలివీడు : వైఎస్సార్‌సీపీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో యువతకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర మాజీ డీఓపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, పార్టీ కన్వీనర్ యదుభూషన్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా గాలివీడు మండలంలో పార్టీ అనుబంధ విభాగాలకు కార్యవర్గాన్ని నియమించడం జరిగిందన్నారు. యూత్ అధ్యక్షులుగా ఎం.రమణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులుగా వి.నాగేశ్వరమ్మ, రైతు విభాగం అధ్యక్షులుగా జి.రెడ్డప్పరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులుగా వల్లెపు నగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గాలివీడు రెడ్డయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా శంకర్ నాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఎస్.నిజాముద్దీన్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా జె.హర్షవర్ధన్ రెడ్డి, పంచాయతీ వింగ్ ఎమ్.భానుమూర్తి రెడ్డి, ఆర్టీఐ వింగ్ బండి అనిల్‌రెడ్డి, వాలంటీర్స్ వింగ్ వండాడి శ్రీహరి, వీవర్స్ వింగ్ సాగినాల శ్రీనివాసులు, వాణిజ్య విభాగం ఆర్.నాగభూషణం, వైఎస్సార్‌టీయూసీ టి.రత్నమయ్య, అంగన్‌వాడీ వింగ్ కొసినేపల్లి శ్వేత, కల్చరల్ వింగ్ బి.రామాంజులు రెడ్డి, సోషల్ మీడియా వింగ్ బి.శివారెడ్డి, దివ్యాంగుల వింగ్ ఎస్కే మహమ్మద్ గౌస్, పబ్లిసిటీ వింగ్ ఎస్కే జాఫర్, క్రిస్టియన్ మైనార్టీ వింగ్ సలాడి సునీల్‌ను నియమించారు.


రాజీలేని పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం



టీచర్లను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందలూరు : రాజీలేని సమరశీల పోరాటాలు యూటీఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్)కే సాధ్యమని నందలూరు యూటీఎఫ్ నాయకులు హరినాథ్, రమేష్, కృపానందం, సుధాకర్, శామ్యూల్ పేర్కొన్నారు. గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన యూటీఎఫ్ సీనియర్ నాయకులకు సన్మాన కార్యక్రమం స్థానిక నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు షేక్ రౌఫ్ బాషా, మస్తాన్‌రెడ్డి, విశ్వనాథ్, వరప్రసాద్‌లు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆది నుంచి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తోందన్నారు.

పండ్ల తోటలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఏపీఓ మీనా కుమారి

పెనగలూరు : మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన ఉద్యాన వనాల(పండ్ల తోటలు)పై సిబ్బంది దృష్టి పెట్టాలని ఏపీఓ మీనా కుమారి తెలిపారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 79 ఎకరాలకు హార్టికల్చర్ మొక్కలు మంజూరైనట్లు ఆమె తెలియజేశారు. పంచాయతీల వారీగా ఎవరికీ ఏ ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఎన్ని ఎకరాలు మంజూరయ్యాయో జాబితా ఇవ్వడం జరిగిందని, నేటి నుంచే హార్టికల్చర్‌కు ఫిట్టింగ్ (గుంతలు) తీసే కార్యక్రమంలో నిమగ్నం అవ్వాలన్నారు. కూలీలతో గుంతలు తీసి రైతులు మొక్కలు నాటుకునే విధంగా వారికి తెలియజేయాలని తెలిపారు. పలు అంశాలపై సమావేశంలో వివరించారు.

సింగయ్య మరణం వెనుక ప్రభుత్వ కుట్ర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి టౌన్ : అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం సంక్షేమం మరిచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ మండిపడ్డారు. గురువారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటనలో ఏదో వాహనం ఢీ కొన్న ఘటనలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సింగయ్యను స్థానికులు చెబుతున్నా ఆస్పత్రికి తీసుకెళ్లకుండా పోలీసులు బాధ్యతను మరిచారన్నారు. అంబులెన్స్‌లో భార్యతో మాట్లాడిన సింగయ్య.. ఆస్పత్రికి వెళ్లేలోపు చనిపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సింగయ్య మరణం ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ కుట్ర అని ఆరోపించారు. అనంతరం జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు చంద్రానాయక్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఒక ఎస్సీ కుటుంబానికి చెందిన అజయ్ కుమార్ అతని భార్యను మహిళ అని చూడకుండా చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయన్నారు. దాడులు నియంత్రించకుంటే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మేధావుల సంఘం అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు శివశంకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ



భోజనం వడ్డిస్తున్న పోలా, అనిల్‌కుమార్‌రెడ్డిలు

రాజంపేట టౌన్ : అన్నదానం మహాపుణ్య కార్యమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నాగులమాను వీధిలో జరుగుతున్న పీర్ల పండుగ వేడుకలో భాగంగా గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పేదలకు భోజనం వడ్డించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏటా నాగులమానువీధిలో నిర్వహించే పీర్ల ఉత్సవంలో తాము పాల్గొని తమ చేతులమీదుగా పేదలకు భోజనం వడ్డించడం పూర్వజన్మ సుకృతమన్నారు. పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీర్ల ఉత్సవ కమిటీ ప్రతినిధులు కాలేషా, రహంతుల్లా, మియాజాన్, యాసిన్, హమీద్, సుధీర్, అర్షద్, సుబ్బరాయుడు, వైఎస్సార్ సీపీ బీసీసెల్ నాయకుడు గోవిందు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ



శక్తిపీఠం వద్ద ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలోని వెంకటశివసాయి ఆలయ సముదాయంలో కొలువైన శ్రీ రాజరాజేశ్వరీ దేవికి గురువారం బోనాల సమర్పణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు, పొంగుబాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి శక్తి పీఠానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు బి.వి సుబ్బారెడ్డి కుటుంబీకులు వెంకటనాథరెడ్డి, రామచంద్రారెడ్డి అమరనాథరెడ్డి, జగన్నాథరెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న మహిళలు

ప్రకృతిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నందలూరు : ప్రకృతిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని ఎస్ఐ రామమోహన్ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అరవపల్లి జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నందలూరు సీహెచ్‌ఓ తనికంటి వెంకటనారాయణ పాల్గొని మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని భావితరాలకు ప్రకృతి ఫలితాలను అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఎస్ఐ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణి, మాజీ అధ్యక్షులు గురుప్రసాద్, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్, మంటి మారయ్య, సునీల్‌రెడ్డి, జంగంశెట్టి హరి, హేమంత్, సుబ్బారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టెండరుదారులతో సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ స్టాల్స్‌లను కేటాయించేందుకుగాను టెండరుదారులతో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు గురువారం సమావేశం నిర్వహించయారు. కడప డిపో మేనేజర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీఎం మాట్లాడుతూ టెండరు నిర్వహించే దుకాణాల గురించి తెలియజేశారు. బస్టాండులోని రూములు, బహిరంగ ప్రదేశాలకు సంబంధించి ఈనెల 10వ తేదీన టెండరు ద్వారా కేటాయింపులు జరుగుతాయని ఆయన వివరించారు. ఈనెల 9వ తేదీ లోగా టెండర్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. ప్రతి టెండరు దారుడు నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆయన సూచించారు.